వాన.. హైరానా

లోతట్టు ప్రాంతాలు జలమయం ● చిత్తడిగా మారిన రోడ్లు ● అవస్థలు పడ్డ ప్రజానీకం


గంగవరం పోర్టు వంతెన పక్కన ఉన్న నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా శుభ్రం చేయిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్


చిత్తడిగా మారిన పెదగంట్యాడ రైతు బజార్


చెరువును తలపిస్తున్న వుడాకాలనీ ప్రధాన రహదారి


అమరావతి పార్కు ఎదురు రోడ్డు మధ్యలో గుంతలు

వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి గాజువాక తడిసి ముద్దయింది. వానకురవడంతో జనం అవస్థలు పడ్డారు. భారీ వర్షం కారణంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో పిల్లలు ఇంటికే పరిమితం అయ్యారు. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, గెడ్డల్లో వర్షపు నీరు పొంగి ప్రవహించింది.


చెరువును తలపిస్తున్న గాంధీనగర్ శివాలయం పక్కరోడ్డు


తోకాడ ప్రాంతంలో నీట మునిగిన కాలనీ

పెదగంట్యాడ: వర్షం వదలడం లేదు.. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ కురుస్తూనే ఉంది. ఫలితంగా జనజీవనం స్తంభించింది. మండలంలోని నడుపూరు, రామచంద్రనగర్, గాంధీనగర్, స్వతంత్ర నగర్, బర్మాకాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ అప్పికొండ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి గాంధీ నగర్ రోడ్డుకిరుపైపులా కాలువలు ఏర్పాటు చేయక పోవడంతో రహదారులన్నీ వరద, మురుగు నీటితో చెరువులను తలపించాయి. గంగవరం పోర్టు వంతెన పక్కనున్న గెడ్డ వద్ద వరదనీరు నిలిచిపోవడంతో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ దగ్గరుండి పూడిక తొలగింపు పనులు చేయించారు.

నీట మునిగిన కాలనీలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 70వ వార్డు తోకాడలో పలు కాలనీలు నీటి మునిగాయి. వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో కాలువల్లో మురుగునీరు, వర్షపు నీరు రోడ్డుపైకి వచ్చి చేరింది. పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో ప్రధాన రోడ్డు గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. 68వ వార్డు అక్కిరెడ్డి పాలెంలోని పలు ప్రాంతాల్లో నివాసాల్లోకి వర్షపు నీరు చేరింది.


కేకేఆర్ వాటర్ ప్లాంట్ రోడ్డులో గోతుల్లో చేరిన వర్షపు నీరు


అక్కిరెడ్డిపాలెంలో పల్లపు ప్రాంతంలో నిలిచిన వర్షపునీరు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహా కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ ఆచార్యులు, ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతుల ఆధ్వర్యంలో పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ముందుగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల, సంతోషి కుమారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పెన్షన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: అవ్వాతాతలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఒక్కరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డులో కార్పొరేటర్ బొండా జగన్‌తో కలిసి శనివారం ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజన్‌రాజు, సిరసపల్లి కనకరాజు, విజయరామరాజు, కల్లేపల్లి శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన సామర్థ్యంతోనే రాణింపు

అగనంపూడి: పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగావకాశాల కోసం నిర్వహిస్తున్న గేట్ ప్రవేశ పరీక్షల్లో రాణించాలంటే అధ్యయన సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలని మోటివేషనల్ స్పీకర్ త్రినాథ్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో గేట్ పరీక్షలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గేట్‌పరీక్షల సిలబస్, ఎలా సిద్ధం కావాలనే వ్యూహాలను తెలిపారు. సమయ పాలన చాలా కీలకంగా మారుతుందని చెప్పారు. సమస్య పరిష్కార మార్గాలను వివరించారు.విద్యార్థుల సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు

ఉక్కునగరం: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు ఆదివారం ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రంలో ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రామేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్, ఉపాధ్యక్షులు విద్యాసాగర్ గిరి, శ్రీకుమార్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసులు హాజరవుతున్నారు. కార్మికులు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన ఉద్యమాలపై తీర్మానం చేయనున్నట్టు ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి కౌర్


స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న అమర్జీత్ కౌర్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో తిరిగి విలీనం చేయాలని ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమర్జీత్ కౌర్ డిమాండ్ చేశారు. ఉక్కు ఎల్ అండ్ డీసీ విభాగం వద్ద శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆమె ప్రసంగించారు. ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసిందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ఐరన్ ఓర్, ఇతర ముడి సరకు సరఫరా చేసి స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం తేవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. రవీంద్రనాథ్, జి. ఓబులేసు, స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఎస్.ఎన్.రావు, డి. ఆదినారాయణ, నాయకులు జె. రామకృష్ణ, మసేనురావు, రాజబాబు, కనకరాజు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న మహిళా ప్రతినిధులు

ఉక్కు దీక్షలకు మద్దతు

అగనంపూడి: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని అవంతి అన్నమాచార్య వాగ్గేయ వరదా వాహిని సంస్థ మహిళా ప్రతినిధి మాతా అవంతి అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన 1297వ రోజు రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.కార్మికుల దీక్షకు మద్దతుగా మహిళా ప్రతినిధులు కోలాట ప్రదర్శన చేశారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేయాలని కోరారు. పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, అవంతి అన్నమాచార్య వాగ్గేయ వరదా వాహిని సంస్థ ప్రతినిధులు ఎస్.వరలక్ష్మి, జి.లక్ష్మి కుమారి, ఎస్.కృష్ణవేణి, కె.సావిత్రి, ఎస్.సీతమ్మ, విజయ వరసాల తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును ఆదుకోండి

బీఎంఎస్ నాయకుల డిమాండ్




ఉక్కు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని, ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, కార్మికులను నష్టపరిచే సర్క్యులర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు జనసేన, టీఎన్‌టీయూసీ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.వి.ఎస్. నాయుడు, జనసేన నాయకులు గంధం వెంకటరావు, నరేంద్ర కుమార్, స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి రామస్వామి, జెర్రిపోతుల రమణ తదితరులు పాల్గొన్నారు.

బిక్కు.. బిక్కు.. ఎవరు దిక్కు?

- ఆందోళన చెందుతున్న కొండవాలు ప్రాంత వాసులు
- వర్షాలు కురవడంతో భయం భయంగా జీవనం


కొండపై నివాసాలు

గాజువాక: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలతో గాజువాకలోని కొండవాలు ప్రాంతాల నివాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఏ కొండపై ప్రమాదం జరుగుతుందో.., ఎక్కడ గోడకూలిన ప్రమాద వార్త వినిపిస్తుందోననే ఆందోళనకు గురవుతున్నారు. ఈ వర్షాలు మరో రెండు రోజులపాటు ఉంటాయన్న వార్తల నేపథ్యంలో కంటి మీద కునుకులేకుండా గడుపుతున్నారు.

ఇదీ పరిస్థితి

గాజువాక పట్టణంలోని ఆరు వార్డుల పరిధిలో 12 కొండవాలు కాలనీలున్నాయి. 20 వేల కుటుంబాలకు పైగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాయి. 65వ వార్డు భానోజీ కాలనీ, సంజీవగిరి కాలనీ, 70వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, 71వ వార్డు శ్రీనగర్, సుందరయ్యకాలనీ, 73వ వార్డు సింహగిరి కాలనీ, 74వ వార్డు దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ, 67వ వార్డు పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్ నగర్, బొజ్జన్నకొండ కాలనీలున్నాయి. తెరిపి లేకుండా వర్షాలు కురిసినప్పుడల్లా కొండలు నానిపోయి ఏదో ఒక ప్రాంతంలో నివాసాలు కూలిపోతున్న విషయం తెలిసిందే. ఏ కొండపై ప్రమాదం చోటు చేసుకున్నా ఈ కాలనీల్లో నివాసులకు కంటిమీద కునుకు ఉండని పరిస్థితి నెలకొంటోంది. వర్షాలు కురిసిన ప్రతిసారి ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. గడిచిన పదేళ్లలో ఇలాంటి సంఘటనల వల్ల సుమారు పది మంది మృతి చెందారు. ఆస్తి నష్టం చోటు చేసుకుంది.

అధికారుల తీరుపై ఆవేదన

ఇదిలా ఉండగా, కొండలపై నివాసం ఉన్నవారికి రక్షణ కల్పించే విషయంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించడంలేదన్న ఆరోపణలున్నాయి. కొండ ప్రాంతాల రక్షణ బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టేసుకుంటూ సమస్యను విస్మరిస్తున్నారని నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండలపై ఆక్రమణలు జరిగిపోతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని జీవీఎంసీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పిస్తుండడం వల్లే ఆక్రమణలు పెరిగిపోతున్నాయని రెవెన్యూ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో కొండవాలు ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

అక్కిరెడ్డిపాలెం: శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి సత్యనారాయణ, నాయకుడు కెంగువ అచ్యుతరావు అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద శనివారం బాధిత కుటుంబాలతో వారు మాట్లాడారు. ప్రమాదం తర్వాత యాజమాన్యం బాధిత కుటుంబాలకు కలిసి భరోసా కల్పించలేదన్నారు.

శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురికావడానికి కారణమైన శ్రావణ్ షిప్పింగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాంబాబు, జోన్ కార్యదర్శి లోకేష్ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. శ్రావణ్ షిప్పింగ్‌లో కార్మికులకు సరైన భద్రత లేదన్నారు.


బాధితుల కుటుంబాలతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి సత్యనారాయణ

ఉపాధ్యాయ వృత్తి గొప్పది


ఉపాధ్యాయుడు తిరుపతిని సత్కరిస్తున్న సీతానగరం గ్రామ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన జాగారపు తిరుపతి మాస్టారు శేష జీవితం హాయిగా సాగిపోవాలని సీతానగరం గ్రామ కమిటీ ప్రతినిధులు ఆకాంక్షించారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరం ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన తిరుపతిని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలకపాటి రఘు వర్మ,వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, నాయకులు చిరంజీవి, కురందాసు వంశీకృష్ణ, నమ్మి అప్పారావు, నమ్మి అప్పలనాయుడు, శ్రీను, పల్లా హరిబాబు, సింహాద్రి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి

ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న నూతన జాతీయ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు

ఉక్కునగరం: ఈపీఎస్-95 పెన్షనర్లకు రూ. 9 వేల పెన్షన్‌తో పాటు డీఏ ఇవ్వాలని ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ఉక్కునగరంలోని సీ భవన్‌లో శనివారం ఈపీఎస్-95 పెన్షనర్ల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఈపీఎఫ్ ట్రస్టులో రూ. 21,30,000 లక్షల కోట్లు కార్పస్ ఫండ్ ఉందన్నారు. వందల కోట్లు వడ్డీ రూపంలో వస్తోందన్నారు. ఆ సొమ్ముతో దేశ వ్యాప్తంగా ఉన్న 73 లక్షల మందికి సులభంగా రూ.9 వేల పెన్షన్‌తో పాటు డీఏ కూడా ఇవ్వొచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేసి... ఆ సొమ్మును అదాని, అంబానీలకు ముట్టచెప్పాలని చూస్తుందని ఆరోపించారు.

నూతన కమిటీ ఎన్నిక

సర్వసభ్య సమావేశం అనంతరం ఈపీఎస్-95 పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మాటూరి శ్రీనివాసరావును జాతీయ అధ్యక్షుడిగా, భార్గుజార్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కె.సత్యనారాయణమూర్తిని ప్రధానకార్యదర్శిగా, ఎస్వీ రమణను కోశాధికారిగా ఎన్నుకున్నారు. డాక్టర్ కె. రాజశేఖర్ అధ్యక్షత వహించిన సమావేశంలో మాటూరి శ్రీనివాసరావు, ఎల్. మురళీకృష్ణ, ఎం. ప్రసాద్, కృష్ణారెడ్డి, సాంబశివరావు, రఫీ, మురళీ రాజు, సంపూర్ణం, బి. సత్యానందం పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



మాట్లాడుతున్న సీతారాం

విశాఖ విద్య: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ,జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో శనివారం ఎన్ఏడీ దరి సరస్వతీ విద్యావిహార్ పాఠశాలలో జీసీడీవో డాక్టర్ ఖలీషా బేగం సమన్వయకర్తగా, గోపాలపట్నం ఎంఈవో సోమేశ్వరరావు అధ్యక్షత బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుతో పిల్లల దృష్టి మత్తు వైపు మరలకుండా అవగాహన కల్పించాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఉమారాణి,సైకాలజిస్ట్ మంత్రి వంశీ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు,ఐ.సి.డి.ఎస్ అధికారి ఎం.వి.రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు


పదవీ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న డీటీసీ రాజారత్నం

అగనంపూడి: అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు అధికారుల మన్ననలు, ప్రజల గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా రవాణాశాఖ అధికారి (డీటీవో) రాజారత్నం అన్నారు. గాజువాక ఆర్టీవో కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన టి.లక్ష్మీనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీవోలు శ్రీనివాస్, ముస్నీషా, రామకృష్ణ, అడిషనల్ ఆర్టీవో రఘుబాబు, ఏవోలు కోటేశ్వరరావు, కృష్ణమోహన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ దాడి చేయిస్తుందని ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం: ఓ మహిళ తన ఇద్దరు ప్రియుల మధ్య చిచ్చు రేపింది. దీంతో మొదటి ప్రియుడు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ఇద్దరు పిల్లల తల్లి అయిన యువతి మొదటి ప్రియుడిని దూరం పెట్టడానికి రెండో ప్రియుడితో దాడులకు ఉసిగొల్పింది. తనపై జరుగుతున్న దాడిపై మొదటి ప్రియుడు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేస్తే రసీదు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. మరో సారి దాడి చేస్తే తనకు రక్షణ లేదని తలంచి నేరుగా సీపీకి ఫిర్యాదు చేశాడు. కాగా మహిళ తన భర్తతో విడాకుల వివాదం కోర్టులో ఉండగా ఇలా ప్రియుల మధ్య చిచ్చు రేపడంపై అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాగా మహిళ, ఆమె మొదటి ప్రియుడు గాజువాకలోని ఒక ప్రైవేట్ స్కూల్లో టీచర్లుగా పని చేస్తున్నట్టు తెలిసింది.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ భాగంగా పలు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. డ్రోన్స్ తయారీ, అసెంబ్లింగ్ టెక్నీషియన్ కోర్సుతోపాటు ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. పదో తరగతి పాసైన వారు కాలేజీలోని స్కిల్ హబ్‌లో సంప్రదించాలన్నారు. వివరాలకు 7287069457 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

'32 నృసింహ రూపాల చిత్రమాలిక' ఆవిష్కరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలోని బేడా మండపంలో ఉన్న 32 నృసింహ రూపాల చిత్రమాలికను శనివారం సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు విజయనగరంలో ఆవిష్కరించారు. స్వామివారి ఆలయ బేడా మండపంలో ఒక్కో స్తంభంపై ఒక్కో నృసింహ రూపం చెక్కి ఉంది. మొత్తం 32 నృసింహ రూపాలు దర్శనమిస్తాయి. వాటిని పెయింటింగ్ రూపంలో వేసి విశాఖకు చెందిన కేతినీడి సత్యచంద్ర సాయికుమార్ పుస్తకంగా తయారు చేశారు. దాన్ని అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, వైదికులు పాల్గొన్నారు.